క్లుప్తంగా

వన్నలిలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ రామారావు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శ్రీకాకుళానికి చెందిన కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చి న గ్రామస్తులకు వైద్యుడు రామారావు జ్వరం, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సంబంధి త, తదితర వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందు లు అందజేశారు. కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ పీఆర్ఓ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్యతనిఖీలు చేస్తున్న వైద్యులు

రేగిడి: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బూరాడ పీహెచ్‌సీలో వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనాచౌదరి గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. క్రమంతప్పకుండా వైద్యత నిఖీలు చేయించుకోవాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఆస్పత్రి ఈఓ రాధాకృష్ణ, సీహెచ్ఎస్ సావిత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: ఉపాధి హామీ పథకంలో భాగంగా కొర్లవలసలో రైతుల పొలాల్లో చేపడుతు న్న ఫారం పాండ్ల తవ్వకాల పనులను ఆ పథకం ఏపీఓ ఎస్.హరనాథ రావు మంగళ వారం పరిశీలించారు. ఫారం పాండ్లతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీఓ వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, తదితరులున్నారు.

బాలికల ప్రతిభ



శ్రేష్టి రాజ్ (95 శాతం) | చింత లాస్య శ్రీ (93.5 శాతం) | వసంతుల హర్షిత (91 శాతం)

రామభద్రపురం: సీబీఎస్ఈ సిలబస్ పదోతరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో బొబ్బిలికి చెందిన శ్రేష్టి రాజ్ 95 శాతం, బూసాయవలస గ్రామానికి చెందిన చింత లాస్యశ్రీ 93.5 శాతం, రామభద్రపురానికి చెందిన వసంతుల హర్షిత 91 శాతం మార్కులు సాధించారు. వీరిని తల్లిదండ్రులతో పాటు పాఠశాల పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



కుళాయిల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

సాక్షి ఎఫెక్ట్...

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిష్కరించారు. 'పిరిడిలో తాగునీటి ఇబ్బందులు' శీర్షికతో సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జేఈ శ్రావణ్‌కుమార్ ఆధ్వ ర్యంలో సిబ్బంది గ్రామానికి చేరుకుని రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నుంచి నీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. అనంతరం కుళాయిల ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

రేగిడి: మండలంలోని వండానపేట, కె.ఎం.వలస, ఉంగరాడమెట్ట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లోని రికార్డులు, పౌష్టికాహార నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. బరువు తక్కువ పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు.

వేసవి దుక్కులకు ఇదే అదును

- వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు
- కలుపు, చీడపీడల పురుగుల నిర్మూలన
- భూసారం, నేలకు నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం పెరుగుతుంది



కె.కొత్తవలస గ్రామంలో దుక్కి దున్నుతున్న రైతులు

వంగర:

ఖరీఫ్ పంటల సాగుకు ముందుగా వేసవిలో పొలాన్ని లోతుగా దున్నే విధానాన్ని వేసవి దుక్కి అంటారు. వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు చెబుతున్నారు. ఖాళీగా ఉన్న మెట్టు, బీడు భూముల్లో ఏప్రిల్, మే నెలల్లో దుక్కులు చేసుకోవచ్చు ని, ఇటీవల కురిసిన వర్షాలతో దుక్కులకు అదును కుదిరిందని చెప్పారు. ఈ దుక్కులతో కలిగే ప్రయోజనా లను ఆయన వివరించారు.

- వేసవి దుక్కులకు ముందుగా పొలంలో పశువుల గత్తం లేదా కంపోస్టు, పొలం స్వభావాన్ని బట్టి చెరువు మట్టిని పొలంలో వెదజల్లాలి. దీంతో నేల సారవంతం కావడమే కాకుండా తేమను నిలుపుకునే శక్తి పెరుగుతుంది
- దుక్కులకు ముందు పొలంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు మందలను వదలడం వల్ల అవి విసర్జించే మలమూత్రాలు పొలంలోకి చేరి భూసారం పెరుగుతుంది.
- లోతుగా దున్నడం వల్ల భూమి లోపలి గట్టి పొరలు విడిపోయి గుల్లబారుతాయి. ఫలితంగా భూమికి ఎక్కువగా నీటిని నిల్వ ఉంచుకునే శక్తి పెరుగుతుంది. సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెందుతాయి. తద్వారా సేంద్రియ పదార్థం పెరిగి భూసారం పెరుగుతుంది.
- లోతు దుక్కుల వల్ల కలుపు మొక్కలు నశిస్తాయి. పొలంలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలైన గరిక,తుంగను దుంపలతో సహా పెగిలించవచ్చును. ఇలా చేయడం వల్లకలుపు మొక్కలు ఎండ తీవ్రతకు నశిస్తాయి. ఫలితంగా ఖరీఫ్ పంటలో కలుపు నివారణకు పెట్టుబడులు తగ్గుతాయి.
- కింద నేలను పైకి వచ్చేటట్లు దున్నడం వల్ల నేలలో నిద్రావస్థలో ఉండే పంటలను ఆశించే చీడపీడలకు కారణమైన పురుగుల గుడ్లు, ప్యూపాలు, లార్వాలు, ఎండు ఆకులు, కొయ్యకాడలు లోపలి పొరల నుంచి భూమి పైకి వస్తాయి. వీటిని పక్షులు తినడం వల్ల, అలాగే ఎండ తీవ్రతకు నశిస్తాయి. తదుపరి సాగుచేసే పంటలకు చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది.
- పురుగులే కాకుండా పలు రకాల తెగుళ్ల వల్ల పంటలకు అపార నష్టం జరుగుతుంది. వేరు కాండం, నారు కుళ్లు తెగుళ్లు వీటిలో ప్రమాదకరమైనవి. వీటి శిలీంద్రబీజాలు భూమి లోపలి పొరల్లో ఉంటాయి. దుక్కులతో శిలీంద్ర బీజాలు భూమి పైకి వస్తాయి. ఇవి ఎండ తీవ్రతకు లోనై తెగుళ్లను వ్యాప్తి చేసే శక్తిని కోల్పోతాయి.
- వేసవి దుక్కులు లోతుగా దున్నడం వల్ల భూమి లోపలి పొరలు విడిపోతాయి.ఫలితంగా మొక్కల వేర్లు భూమి లోపలి పొరల్లోకి చొచ్చుకుపోయి, లోపలి పొరల్లోని నీరు, పోషకాలను గ్రహించే అవకాశం ఉంటుంది.
- క్షారత్వం ఎక్కువగా ఉన్న భూముల్లో నేల లోపలి పొరలు గట్టిపడి మురుగునీరు పోయే సౌకర్యం తగ్గిపోతోంది. లోతు దుక్కులు మూలంగా క్షారాలు, లవణాలు భూమి పొరల్లోకి జారిపోయే అవకాశం ఉంది.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా దున్నాలి. వాలుకు నిలువుగా దున్నితే నేల కోతకు గురై భూమిలోని సారవంతం కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వాలుకు అడ్డగా దున్నడం వల్ల వర్షం నీరు భూమి లోపలికి ఎక్కువగా ఇంకుతుంది. క్రమేణా వాలు కూడా తగ్గిపోతుంది.
- వేసవిలో వర్షాలు కురిసిన వెంటనే పొలాలను దున్నేందుకు ప్రత్యేకమైన పనిముట్లు వాడాలి. కల్టివేటర్‌తో 5 నుంచి10 సెంటీమీటర్ల లోతులో మాత్రమే దున్నవచ్చు. దీంతో పెద్దగా మేలు జరగదు. దుక్కి లోతుగా దిగేందుకు పల్లెపు నాగలి లేదా డిస్కటిల్లర్, రోటావేటర్‌ను వాడాలి.
- లోతు దుక్కులకు రెక్కల నాగలి మంచిది. ఈ నాగలి సెట్ పైకి లేచిన మట్టిపెళ్లలను ఎప్పటికప్పుడు తిరబడేలా చేస్తుంది. సాధారణ రోటావేటర్‌తో దుక్కి చేయడం కంటే రెక్కలి నాగలి సెట్‌తో చేయడం మంచిది. అదుబ్బలు, రాళ్లు లేని పొలాలకు మాత్రమే ఈ నాగలి సెట్ అనుకూలం.
- దుంపలు, రాళ్లు ఎక్కువగా ఉన్న భూముల్లో దుక్కులకు పల్లెపు నాగలిని ఉపయోగించుకోవచ్చు. భూమిలో తేమశాతం ఎక్కువగా ఉన్న సమయంలో కూడా ఈ నాగలి సెట్‌తో దుక్కులు చేయవచ్చు.

సంఘాలను ప్రగతి పథంలో నడపాలి



వీఓఏలు, సీఎఫ్‌లకు సూచనలు చేస్తున్న సెర్ప్ మేనేజర్ మూర్తి

రేగిడి: డ్వాక్రా సంఘాలను ప్రగతి పథంలో నడిపించాలని సెర్ప్ మేనేజర్ డి.మూర్తి మహిళా సంఘాల అధ్యక్షులకు సూచించారు.స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీలు, సీఎఫ్‌లతో పాటు వీఓఏలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలను గ్రేడ్‌ల వారీగా విభజించి, వెనుకబడిన సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తెచ్చేలా ప్రణాళి కలను అమలు చేయాలని చెప్పారు. మొబైల్ బుక్ కీపింగ్‌లో భాగంగా సంఘంలావాదేవీలన్నిం టినీ మొబైల్ యాప్‌లో నమోదుచేయాలని వీఓఏలకు సూచించారు. వెలుగు ఏసీ చిరంజీవి, ఏపీఎం గోవిందరావు, సీసీలు పాల్గొన్నారు.

సంగయ్య మృతికి సంతాపం



సంగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుంట సంగయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు.ఈవిషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మృతుడు సంగయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహం వద్ద నివాళు లర్పించారు.

పరామర్శ

బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ అధ్యక్షుడు, పూడివలస గ్రామానికి చెందిన తెంటు తిరుపతినాయుడు కుమారుడు జ్ఞానేశ్వర్‌కు ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం పూడివలసకు వెళ్లి జ్ఞానేశ్వర్‌ను పరామర్శించారు. శంబంగి వెంట జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, నాయకులు తిరుపతిరావు, కాగన అప్పన్న, కండి రాము తదితరులు ఉన్నారు.

కిశోరీ బాలికలకు అవగాహన



బొబ్బిలిరూరల్: కలవరాయిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

బొబ్బిలిరూరల్: కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కలవరాయి గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో కిశోరీ బాలికలకు ఐసీడీఎస్ పీఓ జాగాన విజయలక్ష్మి హక్కులు, పోక్సో, రక్షణ చట్టాలు, తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ, వారి ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధా న్యం ఇస్తోందన్నారు. రక్తహీనత బారినపడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజు, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం

వంగర: కిశోరీ బాలికలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజినీదుర్గ అన్నారు. కిశోరీ వికా సం కార్యక్రమంలో భాగంగా శివ్వాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు బాలల హక్కులు, పోక్సో చట్టం, రుతు క్రమం సమయంలో పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకరల్తు పి.భారతి, దమయంతి, ఏఎన్ఎం శ్యామల పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



సంతకవిటి–చిత్తారపురం రహదారి నుంచి లాబాం–బొతులజగ్గుపేట బ్రిడ్జ్ అప్రోచ్‌రోడ్డును అనుసంధానం చేసే మట్టి రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డంతా చిత్తడిగా తయారైంది. గోతుల్లో నీరు నిలిచిపోయిరోడ్డంతా బురదమ యమైంది. మన్యం జిల్లా పాలకొండ, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, హిరమం డలం, పాతపట్నం తదితర ప్రాంతాలకు నిత్యం ఈ మార్గంలోనే వందలాది వాహనాలు ప్రయాణి స్తుంటాయి. అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. – సంతకవిటి

ఛలో ఉర్దూ లైబ్రరీ



రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆదేశాల మేరకు బొబ్బిలి పట్టణంలోని ముస్లింలు ఉర్దూ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ మంగళవారం ప్రదర్శన చేపట్టారు. రాష్ట్రంలో ఉర్దూ ద్వితీయ భాష అని, ఉర్దూను ప్రాచీన భాషగా గుర్తించి ముస్లింలంతా ఉర్దూ లైబ్రరీకి తరలివెళ్లాలని లైబ్రేరియన్ ఎం.ఏ. ఖుద్దూస్ పిలుపునిచ్చారు. జామియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ హాజీ పీరా, మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ రియాజ్ ఖాన్, హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ,షేక్ జాఫర్,హమీద్ తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

200 పనిదినాలు కల్పించాలి



ఉపాధి హామీ వేతనదారులకు ఏడాదికి 200 పనిదినాలు కల్పిస్తూ, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిమవరం గ్రామంలో మంగళ వారం ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులను కలిసి లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. వేతనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగ లేబర్ కోడ్‌లను తీసుకురావడం అన్యాయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు మురళి పాల్గొన్నారు. – బాడంగి

'పల్లె పండగ' పనుల బిల్లులు ఎప్పుడిస్తారు..?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వం 'పల్లెపండగ' పేరుతో హడావుడి చేసి పంచాయతీల్లో పనులు చేయించిందని, ఆ బిల్లులు ఎప్పుడిస్తారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఉపాధి హామీ, పశుసంవర్థక, గ్రామ పంచా యతీ, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ శాఖల పద్దులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు చెల్లించకపోతే ఎలా అంటూ పంచాయతీ రాజ్ అధికారులను నిలదీశారు. గత ప్రభుత్వం మార్చి నెలలోనే పెండింగ్ బకాయిలను విడుదల చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హడావుడే తప్ప చేసిందేమీలేదని దుయ్యబట్టారు. అప్పులుచేసి పనులు చేయించి నష్టపోతున్నామని, సంబంధిత బిల్లులు ఇంత వరకు విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. అలాగే నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా విద్యుత్‌శాఖాధికారులు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.పంచాయతీలకు పెండింగ్ నిధులను విడుదల చేయాలని సూచించారు. అంతకు ముందు ఇటీవల మృతిచెందిన మాజీ జెడ్పీ చైర్మన్ పాలవలస రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల సునీత, నక్క వర్షిణి, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వెండర్లందరినీ గుర్తించాలి



మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని వీధి విక్రయదారులను గుర్తించి వారిని వెండర్స్ కనెక్ట్ యాప్‌లో నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందికి సూచించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీపీఎస్‌ల ద్వారా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీధి విక్రయదారులందరికీ గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఈనెల 17లోగా నమోదు కార్యక్రమం పూర్తవ్వాలని గడువు విధించారు. టీపీఆర్ఓ ఎం.జగన్‌మోహనరావు, టీపీఎస్ ఫిలిప్, సీఎంఎం, ఆర్పీలు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ సిరిమానోత్సవం



బొబ్బిలిరూరల్: కమ్మవలసలో సిరిమానోత్సవం



బాడంగి: వాడాడలో పైడితల్లి సిరిమాను తిరువీధి



బాడంగి: సిరిమానుకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



రాజాం సిటీ: కొతారిపురంలో సిరిమాను ఊరేగింపు

బొబ్బిలిరూరల్: మండలంలోని కమ్మవలస గ్రామదేవత పైడితల్లమ్మ సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు మేళతాళాల మధ్య పూజారి తమ్మిరెడ్డి శంకర్ సిరిమానును అధిరోహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సిరిమానును ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, సర్పంచ్ పిల్లా వసుంధర, గ్రామ ప్రజలు అమ్మవారికి, సిరిమానుకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వాడాడలో...

బాడంగి: వాడాడలో మంగళవారం నిర్వహించిన గ్రామదేవత పైడితల్లమ్మ సిరిమానోత్సవం అంబరాన్నంటింది. పూజారి గొట్టాపు సత్యం సాయంత్రం 4 గంటలకు సిరిమానును అధిరోహించారు. పెద్దవీధిలో అమ్మవారి గద్దెవద్ద ప్రారంభమైన సిరిమాను ఊరేగింపు, ఘటాల తిరువీధి రాత్రి వరకు కొనసాగింది. సిరిమాను తిప్పడానికి సిద్ధమైన సమయంలో ఈదురుగాలులతో వర్షం కురవడంతో అర్ధగంట పాటు ఊరేగింపునకు అంతరాయం కలిగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై పైడితల్లి అమ్మవారిని, సిరిమానును దర్శించుకుని పూజాలుచేశారు. సిరిమానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొతారిపురంలో...

రాజాం సిటీ: మండల పరిధి కొతారిపురం గ్రామంలో అసిరితల్లమ్మ సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.మహిళలు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్షిప్తంగా...

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నరసింహనాయుడు

రాజాం: పట్టణానికి చెందిన మజ్జి నరసింహనాయుడును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి గా నియమించినట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుప్పిలి చైతన్యకుమార్ తెలిపారు. రాజాంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నరసింహనా యుడుకు నియామక పత్రం అందజేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, సీనియర్ నాయకులు సానమనేటి శ్రీనివాసరావు, వంగర, సంతకవిటి మండలాల అధ్యక్షులు బెవర సత్యంనాయుడు, కనకల రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా దాడితల్లి మారు జాతర



బొబ్బిలి: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, కోరినకోర్కెలు తీర్చే కల్పవల్లి గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి మారు జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంతో పాటు, బైపాస్ రహదారిలోని ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


కూల్చిన బావి గట్టును పునర్నిర్మించండి

బొబ్బిలి: పట్టణంలోని చర్చి సెంటర్, చినబజారు మధ్య గల మున్సిపల్ కూల్చిన బావి గట్టును పునర్నిర్మించాలని సంబంధీకులను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ఉదయం పట్టణంలోని బలిజిపేట రోడ్డు, అగురు వీధి,మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఒక్కరూ మున్సిపల్ డస్ట్‌బిన్‌లను ఉపయోగించాలని, చెత్తను రోడ్లపై వేయకూడదని చెప్పారు. ఆమె వెంట మున్సిపల్,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కొలు రైతుల వినతి

బాడంగి: తమకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సాగు పెట్టుబడి సహాయం అందించాలని కోరుతూ తహసీల్దార్ సుధాకర్‌కు కోడూరు గ్రామానికి చెందిన కొలు రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కొలు రైతులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు మెట్టు పంటలతో పాటు మామిడి,జీడితోటలను పెంచుతూ వాటి ఫలసాయంతో జీవనం గడుపుతున్నామని చెప్పారు. మాలాంటి వారందరికీ పెట్టుబడి సహాయం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఈనెల20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించదన్నారు. మా వందకుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సహాయం అందేలా చూడాలని అభ్యర్థించారు. కొలు రైతులు కె.రాజు, కె.జోజి, లోగి సంజీవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

రామభద్రపురం: నేరాల నియంత్రణకు, అలాగే నేరాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఎస్ఐ వి.ప్రసాదరావు అన్నారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పెద్దలు, ఆర్థికంగా బాగా ఉన్నవారి సహాయంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలని చెప్పారు. గతపది రోజుల్లో మండలంలో నాలుగు బాల్య వివాహాలను అడ్డుకుని, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.అలాగే మహిళలు,బాలికల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు.